సాక్షి నంద్యాల

శనివారం । 17 । ఆగస్టు । 2024



వర్షంలో 'రైతన్న కష్టం'

అరగంట వర్షం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అల్లకల్లోలం సృష్టించింది. శుక్రవారం కురిసిన తేలికపాటి వర్షానికే వేరుశనగకాయల దిగుబడులు తడిచి నష్టం వాటిల్లింది. 8లో▸



పూజ్యాయ.. రాఘవేంద్రాయ

మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. శ్రీమఠం ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,620
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,419
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 86,310

న్యూస్‌రీల్

డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు ఇండియన్ పోలీసు మెడల్



డోన్ టౌన్: ఇటీవల డోన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసులకు అరుదైన గౌరవం దక్కింది. పోలీసు శాఖ విధుల్లో అత్యంత ప్రతిభ కనబరిచే వారికి భారత ప్రభుత్వం ఇచ్చే ఇండియన్ పోలీసు మెడల్ అవార్డుకు ఈయన ఎంపిక య్యారు. గతంలో కర్నూలు ఉమ్మడి జిల్లా సీఐడీ విభాగంలో పని చేసిన ఈయన కొన్ని కేసులను ఛేదించడంలో ప్రతిభ చాటడంతో ఈ అవార్డును ప్రదానం చేశారు. వచ్చే ఏడాది జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే ఉత్సవాల్లో సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులను సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులతో పాటు పట్టణానికి చెందిన పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

ఏఎస్పీ ప్రవీణ్ కుమార్ బదిలీ

సాక్షి, నంద్యాల: నంద్యాల అదనపు ఎస్పీ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయనను విశాఖపట్నం ట్రాఫిక్ అదనపు డీసీపీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణకుమార్ ఎన్నికల సమయంలో వైఎస్సార్ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఐదు నెలలు కూడా పూర్తి కాకుండానే బదిలీ కావడం గమనార్హం. ప్రవీణ్ కుమార్ స్వస్థలం శ్రీకాకుళం జిల్లా. ఆయన స్థానంలో ఏసీబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎం. మహేంద్రను ప్రభుత్వం నియమించింది.

వేసవిని తలపిస్తున్న ఎండలు

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో సాధారణంగా 32 నుంచి 34 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండాలి. కానీ 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ నెల 13న 36.5, 14న 36.5, 15న 37.3, 16న 36.5 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 27 నుంచి 29 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి.

దోచుకుతిందాం

పేదల ఆకలి పేరుతో తెలుగు దేశం పార్టీ నేతలు కడుపు నిండా ఆరగిస్తున్నారు. అన్న క్యాంటీన్ల మరమ్మతులు వారికి విందు భోజనంలా మారాయి. కంచం నిండా అవినీతి, దోపిడీ, అక్రమాలను వడ్డించుకుంటున్నారు. నిబంధనలకు నీళ్లు వదిలి.. ప్రజా ధనాన్ని లూటీ చేసి.. బొజ్జలు నింపుకుంటున్నారు. క్యాంటీన్లు తెరవకముందే టీడీపీ నేతలు నిధులను మెక్కేస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు 'అన్న'న్నా.. ఇదేమి చోద్యమంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ఇది నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్. మరమ్మతులు, సుందరీకరణకు రూ.12 లక్షలు ఖర్చు చేశారు. పైపై మెరుగులద్దేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయడంపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. పేదల ఆకలి మాటున టీడీపీ నేతలు మెక్కేస్తున్నారని విమర్శిస్తున్నారు.

- అన్న క్యాంటీన్ల మరమ్మతులకు రూ.39.50 లక్షలు
- పాత భవనాల సుందరీకరణకు అధిక వ్యయం
- జిల్లాలో 5 ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- నందికొట్కూరులో రూ. 23.70 లక్షలతో కొత్త క్యాంటీన్



చిత్రంలో కనిపిస్తున్న భవనం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గోస్పాడు మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్. దీని నిర్మాణానికి రూ.17.50 లక్షలు ఖర్చు చేశారు. అధునాతన బిల్డింగ్‌తో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించింది. ఇలాగే అప్పటి ప్రభుత్వం ఊరూరా సచివాలయాలు, ఆర్‌బీకేలు నాణ్యతతో నిర్మించించి మెరుగైన సేవలను అందించింది.

నంద్యాల(సిటీ): అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' అమలు చేస్తాం అంటూ హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు మాటమార్చారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని.. పథకాలు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదని ప్రజలను మభ్యపెడుతున్నారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు భృతి.. ఉచిత బస్సు ప్రయాణం .. ఇలా హామీలన్నింటినీ తుంగలోకి తొక్కేందుకు యత్నిస్తున్నారు. డబ్బులు లేవంటూనే మరోవైపు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అన్న క్యాంటీన్ల పేరుతో టీడీపీ నాయకులకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అన్న క్యాంటీన్ ఏర్పాటు మాటున తమ అనునాయులతో లక్షలాది రూపాయలు దోచుకునేందుకు తెరలేపారు. జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో రోజువారీ పనులకు వచ్చిన పేదల ఆకలిని తీర్చేందుకు అంటూ చెబుతూనే మరోవైపు ప్రజా సొమ్మును దర్జాగా దోచేస్తున్నారు. జిల్లాలో రద్దీగా ఉన్న 5 ప్రాంతాలలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పాత భవనాన్ని ఆధునికీకరించడానికి రూ.9 లక్షలు ఖర్చు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఉన్న భవనం మరమ్మతులకు రూ.12 లక్షలు వెచ్చించారు. ఆళ్లగడ్డలో పాతూరి స్ట్రీట్ వద్ద ఉన్న భవనానికే రంగులద్దడానికి రూ.6 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. డోన్ ఎల్ఐసీ కార్యాలయం వెనుక రూ. 5లక్షలతో మరమ్మతులు చేశారు. ఆత్మకూరు పాత బస్టాండ్ వద్ద రూ.7.50 లక్షలతో పాత భవనాన్ని మరమ్మతులు చేశారు. నందికొట్కూరు జైకిసాన్ పార్క్ వద్ద రూ.23.70 లక్షలతో కొత్త క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు టెండర్ పిలిచినట్లు తెలుస్తోంది. ఒక గ్రామంలో సాధారణంగా ఇంటి నిర్మాణానికి రూ.10 నుంచి 15 లక్షలు దాకా ఖర్చు వస్తుంటే కట్టిన భవనాల మరమ్మతులకు లక్షలాది రూపాయల ప్రజా సొమ్మును ఖర్చు చేయడం వెనుక నిధుల దోపిడీ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్న క్యాంటీన్ల ప్రారంభం వాయిదా పడింది. ఆగస్టు 15వ తేదీ అని ముందు నిర్ణయించినా వాయిదా వేశారు. వచ్చే నెలలో ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పాత భవనాలకే పైపై మరమ్మతులు..

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేరుతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను నేడు కూటమి ప్రభుత్వం నీరు గార్చే దిశగా చూస్తోంది. సుదూర ప్రాంతాల పట్టణాలకు వచ్చిన వారికి ఆకలి తీర్చేందుకు నామ మాత్రపు ధరతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం అందించడంలో టీడీపీ నాయకులు తమ మార్క్ చూపించేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలో ఐదు ప్రాంతాలలో పాత భవనాలకు రంగులద్ది లక్షలాది రూపాయలు నొక్కేసినట్లు తెలుస్తోంది. పాత భవనాలకు మరమ్మతులను చేయడానికి, టైల్స్, ఫ్లోరింగ్, క్లాడింగ్ (ప్లాస్టిక్ డిజైన్ల), డైనింగ్ సామగ్రిని అమర్చడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. సామాన్యునికి ఆహారాన్ని అందించడాన్ని బూచిగా చూపించి తమ వారికి లబ్ధి చేకూర్చేలా కనిపిస్తోంది.

క్లాడింగ్, ఫ్లోరింగ్, రంగులకు రూ. లక్షలు..



నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్‌లో పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

జిల్లాలో అన్ని భవనాలు 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో పాత భవనాలు ఉన్నాయి. ప్రతి భవనంలో క్లాడింగ్ (ప్లాస్టిక్ డిజైనింగ్) కోసం ప్రతి చదరపు అడుగుకు సుమారుగా రూ.280 ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతి అన్న క్యాంటీన్‌లో సుమారుగా 1,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా రంగులకు, ఫ్లోరింగ్‌కు, డైనింగ్, సామగ్రి, ఇంటీరియర్ టైల్స్ ఏర్పాటుకు ఇలా లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. తమ్ముళ్లకు దోచిపెట్టిన ప్రభుత్వం మరో వైపు నిధుల లేమి అంటూ విరాళాలతో నడపాలనే ఆలోచన చేస్తోంది. అన్న క్యాంటీన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలని చూసినా అందుకు సరిపడే ఖర్చు తడిసి మోపెడయ్యేలా ఉంది. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఏకంగా దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగస్టు15న అన్న క్యాంటీన్ల నిర్వహణకు సామాన్యులు ముందుకు రావాలని పిలుపునివ్వడం చూస్తే అన్న క్యాంటీన్లను పూర్తి స్థాయిలో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు.



క్యాంటీన్ లోపలి భాగంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

స్థానిక వనరులపై దృష్టి సారించాలి

- ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి రేటు సాధించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లా ప్రజలు స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా దృష్టి సారించాలని, ఆ మేరకు ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటనరీ హాల్లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 ప్రణాళిక రూపకల్పనలో భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లో స్థానికంగా లభ్యమయ్యే దేశీయ ఉత్పత్తులు, వనరులను వినియోగించుకుంటూ ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి రేట్ పెరిగేలా కార్యాచరణ రూపొందించి ఈనెల 23వ తేదీలోగా సంక్షిప్త నివేదికలను ఇవ్వాలన్నారు. అభివృద్ధి సూచికల్లో జిల్లా దిగువ నుంచి 5వ స్థానంలో ఉందన్నారు. పేదరిక నిర్మూలన దిశగానే ఐదు సంవత్సరాల విజన్ డాక్యుమెంటును నివేదికలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిందని ఈ మేరకు అన్ని శాఖలు కొత్త ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. జిల్లాలో 158 మందికి మైనింగ్ లీజులకు ఇస్తే పనులు చేయకపోవడానికి గల కారణాలు ఏమిటని మైనింగ్ అధికారులను ప్రశ్నించారు. మాత శిశు మరణాలు తగ్గించడం, రక్తహీనతను అధిగమించడం, దీర్ఘకాలిక రోగాలు తగ్గించే విధంగా దూర దృష్టితో ప్రణాళిక సిద్ధం చేయాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్వో ప్లాంట్లను తగ్గించి శుద్ధ జలం అన్ని గ్రామాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అటవీ సంపదను పరిరక్షించుకుంటూ ఎకో టూరిజంను అభివృద్ధి చేసేలా నివేదికలు ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టళ్లను మెరుగుపరచడంతోపాటు చేతివృత్తుల పనిముట్లకు ప్రాధాన్యత ఇస్తూ వారి జీవన ప్రమాణాలు పెరిగేలా నివేదిక తయారు చేయాలన్నారు. సాగునీరు అందని ప్రాంతాలను గుర్తించి ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ఆ మేరకు నివేదికలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు వేణుగోపాల్, రామచంద్ర, ప్రతాపరెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.





సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న వందలాది మంది భక్తులు

కటాక్షించు.. వరలక్ష్మీ

జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామివారు మహాశక్తి స్వరూపిణి భ్రమరాంబాదేవి వారు స్వయంవ్యక్తంగా వెలసిన శ్రీశైల మహాక్షేత్రంలో శ్రావణమాసం రెండో శుక్రవారం భక్తులు వరలక్ష్మీ వ్రతాన్ని నోచుకుని కటాక్షించు తల్లీ .. అంటూ పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంతో చంద్రవతి కల్యాణ మండపం కళకళలాడింది. దాదాపు 1500 మంది ముత్తైదువులు వ్రతంలో పాల్గొన్నారు. – శ్రీశైలంటెంపుల్



వరలక్ష్మీ అలంకారంలో అమ్మవారు

బైరెడ్డి మాట అంటే లెక్కలేదా?

- ఏవోపై చిందులు తొక్కిన మాజీ ఎమ్మెల్యే వర్గీయులు



ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజు రావుతో కోపోద్రిక్తులవుతున్న బైరెడ్డి వర్గీయులు

పగిడ్యాల: 'బైరెడ్డి మాట అంటే లెక్కలేదా' అంటూ ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) నాగరాజరావుపై మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వర్గీయులు చిందులు తొక్కారు. శుక్రవారం సాయంత్రం పండుగ జయరామిరెడ్డి, లక్ష్మాపురం సర్పంచ్ సుజాత భర్త వెంకట్, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి భర్త మురళీ, బుడగజంగాల శేఖర్ ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఎంపీడీఓ వెంకటరమణ సమక్షంలో ఏఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి చేసిన రోడ్డు పనుల బిల్లులు రూ. 9.50 లక్షలు నిలపాలని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చెప్పినా పట్టించుకోరా అంటూ ఊగిపోయారు. ఎందుకు బిల్లులు పెట్టావో సమాధానం చెప్పాలని ఏఓను దుర్భాషలాడారు. లక్ష్మాపురం అంచకాడ కట్టేస్తా అంటూ సర్పంచ్ భర్త వెంకట్ బెదిరించారు. బిల్లు పెట్టిన విషయంపై లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని లేదంటే బైరెడ్డి దగ్గరకు పోదాం అంటూ బలవంతం చేశారు. ఈనెల 2వ తేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రాలు పుల్యాల దివ్య అడిగారని, పనులు సక్రమంగా ఉన్నాయని పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు ఎం.బుక్ రికార్డింగ్ చేయడంతో ఈనెల 18వ తేదీన పాస్ ఆర్డర్ తీసుకున్నామని సమాధానం చెప్పినా వినలేదు. బైరెడ్డి వర్గీయుల దూషణ పర్వతంతో ఏఓ కన్నీటిపర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్ఐ గంగయ్య యాదవ్ సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని సర్ది చెప్పి పంపివేశారు.

ఇంకా 'సిద్ధ'ం కాలేదు!



సిద్ధాపురం ఎత్తిపోతల మోటారు

- సిద్ధాపురం ఎత్తిపోతలకు మరమ్మతుల గ్రహణం
- అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో లోపించిన ముందుచూపు
- వీబీఆర్ నిండుతున్నా నీటిని ఎత్తిపోయని వైనం
- గత ఐదేళ్లు శిల్పా సహకారంతో సకాలంలో చెరువుకు నీరు



సిద్ధాపురం చెరువు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల రైతుల జీవనాడి సిద్ధాపురం ఎత్తిపోతల పథకం. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి రెండు స్టేజీల ఎత్తిపోతలతో ఈ చెరువుకు రెండు టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. మండలంలో సుమారు 23 వేల ఎకరాల సాగుభూమికి ఈ పథకం ద్వారా నీరందుతోంది. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఎత్తిపోతల మోటార్లు మౌనం పాటిస్తూ ఉండడంతో సిద్ధాపురం చెరువు నోరు తెరుచుకుని నీటి కోసం ఎదురు చూస్తోంది. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 8 టీఎంసీల నీటి చేరికతో సిద్ధాపురం ఎత్తిపోతల మొదటి లిఫ్ట్ హెడ్‌కు నీరు అందుతోంది. దీంతో ఎత్తిపోతల ప్రారంభించ వచ్చు. కాని ప్రస్తుతం 15 టీఎంసీల నీరు వీబిఆర్‌లో ఉన్నప్పటికీ సిద్ధాపురం మోటార్లు పని చేయని పరిస్థితి నెలకొంది. గ్రావిటీతో నీటి పారకం జరిగే మద్రాసు కెనాల్‌కు, గాలేరు స్పిల్‌వే ద్వారా కుందూనదికి, వన్‌ఆర్, వన్‌ఎల్ తూములకు ఇప్పటికే నీటి విడుదల జరుగుతోంది. వర్షాల వల్ల కొండవాగుల ద్వారా వచ్చిన నీటిచేరిక సిద్ధాపురం చెరువులో నాలుగు అడుగుల మేర నీరు చేరింది. మొత్తం 0.65 టిఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న చెరువులో 23 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టం కలిగి ఉంది. కేటాయించబడిన నీటిని వినియోగించుకోవాలంటే చెరువును మూడు విడతలుగా నింపుకోవాల్సి ఉంది. అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కించుకుంటూ ఉంటే వారిని ఉరుకులు పరుగుల పెట్టించాల్సిన రాజకీయ నాయకత్వం మౌనం వహించడం రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఏటా అదే సమస్య.. పరిష్కారానికి తీవ్ర జాప్యం

సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం భూమిలో వేసిన కేబుల్ తరచూ మరమ్మతులకు గురవుతుండడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. ఏటా నీటి విడుదల సమయానికి కేబుల్ ఏదో ఒక చోట బర్న్ కావడమో, తెగి పోవడమో జరుగుతుంది. ఈ ఏడాది కూడా అదే సమస్య తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు. కేబుల్ రిపేరు కోసం హైదరాబాదు నుంచి సాంకేతిక బృందం వచ్చినప్పటికీ వారి మిషనరీలో లోపం తలెత్తింది. మిషనరీ రిపేరుకు అవసరమైన సామగ్రి విదేశాల్లో మాత్రమే లభిస్తుంది. ఇలా సాంకేతిక కారణాల వల్ల ఎత్తిపోతల పథకం నీటి విడుదల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యలు గతంలోనూ ఉండేవే. అయితే ముందు చూపు ఉన్న రాజకీయ నాయకత్వం కారణంగా గడచిన ఐదేళ్లు ఏనాడు నీటి విడుదలకు అంతరాయం ఏర్పడ లేదు. ఏటా ఈ కేబుల్ రిపేర్ల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టి ఆ డబ్బు వచ్చేంత వరకు జాప్యమవుతుండటంతో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన సొంత నిధులు రూ. లక్షల్లో వెచ్చించి సకాలంలో మరమ్మతులు చేయించే వారు.

మరమ్మతులు పూర్తి చేయిస్తాం

సిద్ధాపురం చెరువు మోటార్లు పని చేయడానికి అవసరమైన విద్యుత్ సరఫరా అందించే కేబుల్‌లో అంతరాయం ఏర్పడింది. రిపేరు చేయడానికి తీసుకు వచ్చిన మిషనరీ పరికరాలు కూడా సాంకేతిక లోపంతో పని చేయక పోవడం వల్ల అనుకున్న సమయానికి నీటివిడుదల జరగలేదు. కేబుల్ సరి చేసిన వెంటనే నీటిని విడుదల చేస్తాం.

– వెంకటేశ్వర్లు శెట్టి, ఈఈ, తెలుగుగంగ

చెరువు నిండితేనే భరోసా



సిద్ధాపురం చెరువు పూర్తి స్థాయిలో నిండితే రైతులు ధైర్యంగా పంట వేసుకుంటాం. నేరుగా నీరందడమే కాక, వ్యవసాయ బావులకు నీటి మట్టం తగ్గకుండా ఉంటుందన్న ధీమా మాకుంటది. నదిలో వరద పారుతుంటే వీబీఆర్ నిండుకుండలా ఉంటే కూడా మా సిద్ధాపురం చెరువు నింపేందుకు అధికారులు ఆలస్యం చేయడం తగదు.

– బర్నాల శివయ్య, రైతు, కరివేన

సిద్ధాపురం నిండకపోతే నష్టాలే



ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగు చేసిన మొక్కజొన్న భారీ వర్షాలకు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాం. ఇప్పుడు వర్షాల్లేవు. మాకు సిద్ధాపురంపైనే ఆశలు పెట్టుకున్నాం. ఈ చెరువు నిండకపోతే చాలా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఎత్తిపోతలను ప్రారంభించాలి.

– శ్రీనివాసులు, రైతు, నల్లకాలువ

క్లుప్తంగా

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య


మృతి చెందిన మాదిగ సువర్ణ

కృష్ణగిరి: అప్పుల బాధతో ఓ మహిళా రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పందిర్లపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. కృష్ణగిరి ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాదిగ పాండు, సువర్ణ(39) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారు. కుమార్తె పెళ్లి, కుటుంబ, వ్యవసాయ ఖర్చుల నిమిత్తం దాదాపుగా రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ నెల 15న తమ పొలానికి వెళ్లిన భార్యాభర్తలు పంటలకు వచ్చిన డబ్బులు వడ్డీలకే సరిపోతున్నాయని బాధపడ్డారు. ఈ క్రమంలో సువర్ణ మిరప నారుకు నీరు పెట్టేందుకు బావి దగ్గరకు పోయి అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. భార్య ఎంతకూ రాలేదని గమనించి పాండు బావి దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే ఆమె అపస్మారకస్థితిలో ఉంది. కుటుంబసభ్యుల ద్వారా డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గురువారం రాత్రి పొద్దుపోయాక సువర్ణ మృతి చెందారు. మృతురాలి తల్లి చిట్యాల గ్రామానికి చెందిన గూటుపల్లి మాదిగ కేశమ్మ ఫిర్యాదు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతదేహాన్ని తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్యాపిలి: చంద్రపల్లి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు (71) మృతి చెందాడు. కాషాయం దుస్తులు ధరించిన వృద్ధుడు గత వారం రోజులుగా చంద్రపల్లిలో భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు గమనిసించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. పంచాయతీ సెక్రటరీ కిరణ్, వీఆర్వో పురుషోత్తం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించారు.

అరటి తోటలో కొండచిలువ


కొండచిలువతో స్నేక్ క్యాచర్ మోహన్

ఆత్మకూరు: మహనంది వెళ్లే మార్గంలోని శ్రీనగరం సమీపంలో ఉన్న అరటి తోటలో శుక్రవారం పొడవైన కొండచిలువ కలకలం రేపింది. పొలం పనుల్లో భాగంగా వెళ్లిన వ్యవసాయ కూలీలు అరటిచెట్ల సారుగు(పట్టలు) మధ్యన ఉన్న కొండచిలువను చూసి భయంతో పరుగులు తీశారు. వెంటనే వారు సమీపంలోని అయ్యన్న నగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. అతను కొండచిలువను పట్టుకుని నల్లమలలో వదిలేశాడు.

'గులాబీ' పురుగును నివారించుకోండి

ఆదోని రూరల్: పత్తి పంటకు సోకే గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్ఏబీసీ (సౌంత్ ఏసియా బయోటెక్నాలజీ సెంటర్) ప్రెసిడెంట్ డాక్టర్ భగీరథ చౌదరి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని బైచిగేరి గ్రామంలోని పత్తి పంటను వారు పరిశీలించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.రాఘవేంద్రచౌదరి, శాస్త్రవేత్త మోహన్‌విష్ణువర్ధన్, నంద్యాల శాస్త్రవేత్తలు భరద్వాజ్, డీఆర్సీ ఎం.గిరీష్, ఏడీఏ అరుణకుమారి, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


విద్యుద్దీప కాంతులతో శ్రీమఠం


బంగారు కాంతుల్లో శ్రీమఠం కారిడార్

పూజ్యాయ.. రాఘవేంద్రాయ

- రేపటి నుంచి సద్గురు 353వ ఆరాధన మహోత్సవాలు
- 18వ తేదీ నుంచి 24 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


రాములోరి సంస్థాన పూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు (ఫైల్)

మంత్రాలయం: వేదభూమిలో సశరీరంగా చింతామణి సదృశ్యులైన శ్రీరాఘవేంద్రుల 353వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ఏడు రోజుల పాటు వేడుకలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దాదాపు రెండు లక్షలకు పైగా భక్తుల తరలివచ్చి వేడుకల్లో తరించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే వేదభూమి విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. రోజూ రాయరు రథోత్సవాలతోపాటు రాములోరి సంస్థాన పూజలు ఉంటాయి. భక్తుల కోసం యోగీంద్ర మంటపంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవ విశేషాలు

- ఆదివారం ఉత్సవాలు ప్రారంభోత్సవంలో భాగంగా ధ్వజారోహణ, ధాన్యపూజ, గోవు, తురగ పూజ ఉంటాయి. ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాల సమర్పణ ఉంటుంది.


రాఘవేంద్రుల మూల బృందావనం

- సోమవారం శాఖోత్సవం, రజత మంటపోత్సవం చేపడతారు.
- మంగళవారం పూర్వారాధన సందర్భంగా సింహవాహనంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు ఉంటుంది. సాయంత్రం యోగీంద్ర మంటపంలో ప్రముఖులకు అనుగ్రహ ప్రశస్థి అవార్డులు ప్రదానం చేస్తారు.
- బుధవారం మధ్యారాధన పురస్కరించుకుని రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేస్తారు. రాత్రి గజవాహనోత్సవం తోపాటు రజత, సువర్ణ రథోత్సవాలు ఉంటాయి. మహా రథోత్సవం, వసంతోత్సవం జరుపుతారు.
- గురువారం ఉత్తరారాధన సందర్భంగా క్షేత్రంలో రాఘవేంద్రుల మహా రథోత్సవం అంగరంగ వైభవంగా చేపడతారు. హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపిస్తారు.
- శుక్రవారం పూర్వపు పీఠాధిపతి సుజ్ఞానేంద్రుల ఆరాధన, అశ్వవాహన సేవలు ఉంటాయి.

ఏర్పాట్లు ఇలా..

ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు పలు ఏర్పాట్లు సిద్ధం చేశారు. భక్తుల కోసం ఐదు లక్షల పరిమళ ప్రసాదాలు తయారు చేశారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అన్నపూర్ణ భోజనశాల, నదీతీరం, సీఆర్వో కార్యాలయం, 200 గదుల సముదాయంతో శౌచాలయాలు ఏర్పాటు చేశారు. అలాగే 100 రెడీమెడ్ టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురానున్నారు. తుంగభద్ర నదిలో వరద నీరు ఉధృతంగా పారుతుండటంతో పుణ్య స్నానాలకు ప్రత్యేక షవర్లు ఉన్నాయి. మఠం సీఆర్ఓ, ప్రధాన ముఖద్వారం, మఠం ప్రాకారం, అన్నపూర్ణ భోజనశాల దారిలో వాటర్ ప్లాంట్లు నెలకొల్పారు. పీఠాధిపతుల కోసం ఈ ఏడాది నూతనంగా గురు నివాస్, మధ్వమార్గ్ కారిడార్ నిర్మించారు.

- శనివారం సర్వ సమర్పణోత్సవంలో భాగంగా బంగారు పల్లకీ, చెక్క, వెండి, బంగారు రథోత్సవాలు ఉంటాయి.

అనుగ్రహ ప్రశస్థి అవార్డుల ప్రదానం

ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్థి అవార్డులు ప్రదానం చేయనున్నారు. మైసూరు రాజవంశీకులు, పార్లమెంట్ సభ్యుడు యదువీర్ కృష్ణదత్త ఛామరాజేంద్ర వడియార్ ప్రత్యేక అతిథిగా వచ్చి ప్రశస్థి అవార్డు స్వీకరించనున్నారు. అలాగే బీజీఎస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశనాథ స్వామిజీ, విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, ప్రొఫెసర్ వజ్ర భూషణ్ ఓజాకు అవార్డు అందజేయనున్నారు. ఉత్సవాల్లో ఏర్పాట్లను మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతిఆచార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కోనాపూర్, పీఆర్వో నరసింహామూర్తి పర్యవేక్షించనున్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా


సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఐదు రోడ్ల కూడలిలోని పవర్‌హౌస్‌లో కర్నూలు డివిజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా ఇంటికప్పుపై కనీసం 10 చ.మీ/100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం రూ.1000 వస్తున్న విద్యుత్ బిల్లు ఒక కిలోవాట్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్న తర్వాత రూ.338 వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. ఏడాదికి ఆదా రూ.8వేల వరకు ఉంటుందని, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు అవకాశమన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ రాయితీ రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు ఉంటుందన్నారు. సమావేశంలో ఈఈ శేషాద్రి, ఏడీఈలు నాగప్రసాద్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

వర్షంలో 'రైతన్న కష్టం'

ఆదోని అర్బన్: అరగంట వర్షం ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అల్లకల్లోలం సృష్టించింది. దిగుబడులు అమ్మకానికి తెస్తే రైతుల కష్టం నీటిపాలైంది. శుక్రవారం కురిసిన తేలికపాటి వర్షానికే యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన వేరుశనగకాయల దిగుబడులు తడిచి ముద్దవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం 158 మంది రైతులు 5,711 సంచుల్లో 2వేల క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులను అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటా గరిష్ట ధర రూ.7,329, మధ్య ధర రూ.6,480, కనిష్ట ధర రూ.3469 నమోదైంది. బోరుబావులకు సంబంధించిన వేరుశనగకాయల దిగుబడులు కావడంతో ఎండకు బయట ఉన్న ప్లాట్ ఫారంపై ఆరబోశారు. అయితే మధ్యాహ్నం అరగంట సేపు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో దిగుబడులన్నీ తడిచి ముద్దయ్యాయి. కొంత దిగుబడి కొట్టుకుపోయింది. ఈ మార్కెట్ గతంలో రెండో ముంబయిగా పేరుగాంచింది. కోట్లలో ఆదాయం ఉన్నా అభివృద్ధిలో వెనుకబడింది. కనీసం కాలువల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో చిన్న వర్షానికే దుకాణాల ముందు వర్షం నీరు నిలిచి రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ప్లాట్‌ఫాంలు సరిగా లేకపోవడం కూడా దిగుబడులు తడిచిపోయేందుకు కారణమైంది. యార్డులో టార్పాలిన్లు లేకపోవడం వల్ల కూడా రైతులు దిగుబడులను కాపాడుకోలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


తడిచిన వేరుశనగకాయలను నింపుతున్న హమాలీలు

60 సంచుల వేరుశనగ దిగుబడులు కొట్టుకుపోయాయి



మూడు ఎకరాలకు 60 సంచుల వేరుశనగకాయల దిగుబడి వచ్చింది. అమ్మకానికి ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చాను. తేలికపాటి వర్షానికి దిగుబడి అంతా నీటిలో తడిచి కొట్టుకుపోయింది. దాదాపు రూ.2 లక్షలు నీటిపాలయింది. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారు. ప్రభుత్వం, యార్డు అధికారులే న్యాయం చేయాలి.

– అబ్దుల్లారహమాన్, ఎరిగేరి, కర్ణాటక రాష్ట్రం

బెటాలియన్స్ రేంజ్-3 డీఐజీగా సీతారాం


నూతన డీఐజీకి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ కమాండెంట్ ప్రభుకుమార్

కర్నూలు: ఏపీఎస్పీ బెటాలియన్స్ కర్నూలు రేంజ్-3 డీఐజీగా నియమితులైన పి.సీతారాం విధుల్లో చేరారు. ఇక్కడున్న సీహెచ్ వెంకటేశ్వర్లు ఈ ఏడాది మేలో పదవీ విరమణ పొందారు. దీంతో సీతారాంను కర్నూలుకు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన ఆర్ఎస్‌ఐ హోదాలో 1991లో ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగంలో విధుల్లో చేరారు. అప్పటి నుంచి డీఐజీగా పదోన్నతి పొందే వరకు గ్రేహౌండ్స్‌లోనే బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆయన కర్నూలు చేరుకుని బాధ్యతలు చేపట్టిన అనంతరం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కర్నూలు రెండవ బెటాలియన్‌లోని పరిపాలనా విభాగం కార్యాలయాన్ని సందర్శించారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కర్నూలు బెటాలియన్‌కు చెందిన కంటింజెంట్ సిబ్బంది కవాతులో పాల్గొని ప్రతిభ కనపరచినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకున్నారు. కప్పును నూతన డీఐజీ సీతారాంకు అందజేయడంతో ఆయన వారిని అభినందించారు. ఇన్‌చార్జి కమాండెంట్ కె.ప్రభుకుమార్, సహాయ కమాండెంట్లు మహబూబ్ బాషా, కేశవరెడ్డితో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలం సిబ్బంది నూతన డీఐజీకి స్వాగతం పలికారు.

అవస్థలు 'ఉచితం'

- ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం సేవలో భక్తులకు ఇక్కట్లు
- ఏర్పాట్లు కల్పించడంలో దేవస్థాన అధికారుల విఫలం


చంద్రవతి కల్యాణ మండపం వద్ద స్పృహ కోల్పోయిన భక్తురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అధికారులు నిర్వహించిన ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం సేవ కార్యక్రమంలో భక్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శ్రావణ రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించింది. చాలా మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా ఉచిత సేవకు టికెట్లు పొందారు. ఆ టికెట్లులో వరలక్ష్మీవ్రతం టైం స్లాట్ ఉదయం 8 గంటలుగా నమోదు అయింది. దీంతో భక్తులు ఉదయం 7 గంటలకే భక్తులు చంద్రవతి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అయితే 9.30 గంటల వరకు భక్తులకు కల్యాణ మండపంలోకి అనుమతించ లేదు. కల్యాణ మండపం వద్ద భక్తులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, భక్తులు కూర్చునేందుకు సౌకర్యాలు కల్పించలేదు. దీంతో 2.30 గంటల పాటు కల్యాణ మండపం బయట పడిగాపులు కాయాల్సి వచ్చింది. అలాగే ఆన్‌లైన్ టికెట్లు స్కానింగ్ కోసం ఒక్క కౌంటర్ మాత్రమే ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది భక్తులు గంటల తరబడి నిలబడలేక స్పృహ కోల్పోయారు. ఈ విషయమై దేవస్థాన అధికారులను వివరణ కోరగా ఆన్‌లైన్ టికెట్‌పై 9.30 గంటలకు వరలక్ష్మీవ్రతం ప్రారంభిస్తున్నట్లు సూచించామన్నారు.

జగజ్జననీ నమోస్తుతే!


అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తి శ్రీ అమృతవల్లీ అమ్మవారికి ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తి శ్రీదేవి అమ్మవారిని దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచారు. నవకళశ స్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేచించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి అమృతవల్లీ అమ్మవారిని వరలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్తయిదువల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారికి మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యాబుద్ధులు ప్రసాదించు తల్లీ!


సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: 'విద్యా వరప్రదాయిని మా చిన్నారులకు విద్యా బుద్ధులు ప్రసాదించు తల్లీ'.. అంటూ కొలను భారతీ క్షేత్రంలో భక్తులు ప్రణమిల్లారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు వారి చిన్నారులకు కొలనుభారతి సన్నిధిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే భవిష్యత్తు ప్రజ్వలిస్తుందని, మంచి విద్యాబుద్ధులు ప్రాప్తిస్తాయని, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని భక్తుల నమ్మకం. దీంతో పురోహితులు చక్రపాణి శర్మ చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. 57 మంది భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీవ్రతం


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, గ్రామ పెద్దలు, ప్రజలు, వేదపండితులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి కుంకుమార్చన చేపట్టారు. అనంతరం ముత్తైదువులతో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.